

# మనిషి మనసు

డాక్టర్ నారాయణరావు

గణగణమని అలారం మోత వినిపించగానే అప్రయత్నంగా గడియారం మీద చేత్తో మొట్టి, ఇక తప్పదన్నట్టు నిద్ర లేవబోతున్నాను. ఉదయం అయిదున్నర. ఈ టైముకైనా లేస్తే గాని నాకు ఎనిమిదింటికి తెమలడం కుదరదు.

"ఛీ వెధవమొహం! వెధవమొహవాని! పొద్దుటే ఇక్కడికెందుకు తగలడ్డావే! పో అవతలికి. నిద్ర లేవగానే వెధవ శకునం మువ్వాను." పక్కింటావిడ గొంతు చించు కొంటోంది.

నాకు ఈ అరుపులు, కేకలు కొత్తవేం కాదు. కనీసం వారానికి నాలుగైదు రోజులైనా ఇలాటి సుప్రభాతం వింటూనే నిద్రలేస్తాను.

మొన్నటికి మొన్న ఇలాగే పక్కింటి హనుమాన్లుగారూ నేనూ బయట నుంచుని మాట్లాడుకుంటున్నాం. ఆయన ఏదో పనిమీద బయటికి వెళుతున్నట్టున్నారు. ఆయనే నన్ను పిలిచి పలకరిస్తే తప్పదని మాట్లాడుతున్నాను. ఆయనకి మా వీధిలో మంచిపేరే ఉంది. రోజూ పూజా పునస్కారం — దైవభక్తి ఉన్నవాడు. మనిషి కూడా మంచివాడే. "మీరేదో బయటికి వెళ్తున్నట్టున్నారు" అన్నాను — ఇకనైనా నే లోపలికి పోవచ్చునా అన్నట్టు. "ఆ! అవునండీ! ఏదీ అదిగో ఆ వెధవమొహం అక్కడేడిసిందిగా! అది ఎటో పోతే నేనూ బయలుదేరుదామని. ఖర్మ! ఎప్పుడు బయటికి వచ్చినా అదే ఎదు రొస్తుంది."

ఇలా ఒకరేమిటి. ప్రతిరోజూ ఎవరో ఒకరు విసుక్కునే మొహం మా వీధిలో ఎన్నేళ్ళనించో అడుక్కుంటూ తిరిగే ముసలమ్మది.

ఆ ముసలమ్మ ఎప్పుడు ఎక్కడ పుట్టిందో నాకు తెలీదుగాని, మేము ఈ వీధిలోకి వచ్చిన ఏడాది దగ్గర్నించి ప్రతిరోజూ కనిపిస్తూనే ఉంటుంది. అప్పుడప్పుడు ఇంకో చిన్నపిల్లని తన కూడా తెస్తూ ఉంటుంది. ఇంతమంది ఇన్నిసార్లు ఇన్నిరకాలగా తిట్టి పోస్తున్నా అది మా వీధిని వదిలేసి దూరంగా ఎందుకు పోదా అని నా కప్పుడప్పుడు అనిపిస్తుంది. నిజం చెప్పాలంటే అది నన్నెప్పుడూ ఏవీ అడగలేదు. అడిగుంటే బహుశ నేను పొమ్మని అందునేమోకూడాను. కాని ఒకటి మాత్రం నిజం. అది ఎదురైతే నాకెప్పుడూ దానిమీద కోపం రాలేదు అది ఎదురవ్వడంవల్ల పని జరగకపోవడంగాని, అశుభం జరిగినట్టుకాని నాకు గుర్తులేదు. మా వీధిలో వాళ్ళు మాత్రం, అది ఎదురైతే దరిద్రం చుట్టుకుంటుం దంటారు.

ఆ ముసలమ్మకి నా అనేవాళ్ళు ఎవరూ లేరని నా నమ్మకం. ఒక మనిషిని పట్టుకుని ఎదుటి మనిషి అంత దారుణంగా మాట్లాడు తుంటే నాకు చాలాసార్లు బాధవేసేది. పాపం అది ఎంత బాధపడుతుందో కదా అనిపించేది. ఎవరితో చెప్పుకోగలదు తన బాధ అని అనుకునేవాడ్ని.

"అబ్బ! దాని మొహవే అంతలెండి. మొన్న మా ఫ్రెండింటికి వెళ్లబోతూంటే ఎదురొచ్చింది — దరిద్రమ్మొహం. వాళ్లింట్లో చూద్దామని చేతిలోకి తీసుకోగానే ట్రాన్సిస్టరు నా చేతిలోంచి కిందపడి దభేలున బద్దలయ్యింది. ఎన్నిసార్లనుకుని ఏం లాభంలెండి. అది కనిపిస్తే అన్నిపన్లూ మానుకోవడమే మంచిది" అది మా ఎదురింటి రామారావుగారి ఉవాచ.

అసలు నిజంగా ఒక మనిషి మొహంలో అంత శక్తి ఉంటుందా! ఏంకీడు చేశారని వాళ్ళందరి పన్లూ అలా పాడయ్యేలా చేస్తుంది ఆ ముసలమ్మ! ఎంతమంది ఎన్ని కథలు చెప్పినా నాకు మాత్రం ముసలమ్మమీద జాలేసేది.

చూడ్డానికి దాని మొహం అంత అందంగా ఉంటుందని నేననుకోను. నెరిసిపోయి, తైల సంస్కారంలేని చింపిరి జుట్టు, గుంట కళ్ళు, సగం మిగిలిన పళ్ళూ, చిరిగి పీలికలైపోయిన చీరా,పదిగజాల దూరంనించే వేసే చుట్టకంపుతో కలిసిపోయిన చెమట వాసన.

అనవసరంగా ఓరోజు హనుమాన్లుగారితో అనేశాన్నేను. నా మనసులోమాట చెప్పింతరువాత చాలాసార్లనిపించింది— చెప్పకుండా ఉండా ల్సిందని. "నిజంగా మీరు దేవుణ్ని నమ్ముతుంటే ఆ భగవంతుడి ఆజ్ఞ లేందే మంచిగాని, చెడుగాని జరగదుకదా! ముసల్దానిమొహం కనిపించినంత మాత్రాన చెడు తప్ప మంచి జరగదని మరింత గాఢంగా నమ్ముతున్నారంటే, మీరు ఆ భగవం

కుడికన్నా, ఈ ముసల్దానికి ఎక్కువ శక్తిని ఆపాదిస్తున్నారనిపిస్తుంది.''

హనుమాన్లుగారికి చాలా కోపం వచ్చింది. కనని తను ఎంత తమాయించుకున్నారో నేనర్థం చేసుకోగలను. నన్ను వెర్రి వెధవని చూసినట్టు చూశారు. "మీ కుర్రాళ్ళకున్న జబ్బేయిది. తన దాకా వస్తేగాని తెలియదు'' అన్నారు చివరికి.

ఖాళీగా కూర్చున్నప్పుడు నాకు ముసలమ్మ తే గుర్తుకొచ్చేది. ప్రపంచంలో ఎవరికీ కేనక్కరలేదు. అందరికీ నేనంటే అసహ్యం ని తెలిసినప్పుడు — ఆ మనిషికి ఎంత మానసిక దనో కదా అనిపించేది. ఏదోనాడు ఈ ఆవేదన రించలేక ముసలమ్మ ఆత్మహత్యకి తలపడు తుందని నాకు తెలుసు. ఏదో తెలీని ఆవేశం చ్చేది. "నువ్వేం బాధపడకు ముసలమ్మా! ళ్ళందరూ మనుషులు కదా! ఇలాగే ప్రవర్తిస్తార్లే! నువ్వంటే నాకేమీ అసహ్యం దు. నువ్వు ఎదురొచ్చినా నాకు ఏమీ నిపించదు'' అని ఎప్పుడైనా చెబ్దామా నిపించేది. మళ్ళీ ఎందుకో దాని రూపం, అదో కం వాసనా గుర్తొచ్చేది. ఆలోచన్లు అంతటితో గిపోయేవి.

# మనిషి మనసు

ఆఫీసునించి వచ్చి సాయంత్రం అయిదింటికి కాఫీ తాగుతూ కిటికీ లోంచి చూస్తున్నాను. మళ్ళీ ఎక్కడో ఏదో అయ్యింది. ముసలమ్మని చాలా గట్టిగా తిడుతున్నారు ఎవరో. ఆత్రంగా బయటికొచ్చి చూశాను. మాధవరావు గారు ముసలమ్మమీద చాలా కోపంగా ఉన్నట్టు న్నారు. స్పష్టంగా వినబడకపోయినా దేనిగురించి తిడుతున్నారో ఊహించుకోగలను నేను. ముసలమ్మ మాత్రం మాటామంతీ లేకుండా తలొంచుకుని నెమ్మదిగా నడుచుకుంటూ పోతోంది అక్కడ్నించి.

మళ్ళీ ఎందుకో నాలో ఏదో ఆవేశం వచ్చింది. ఎలాగైనా ముసలమ్మకి ఈ సాయంత్రం నా మనసులోని మాట చెప్పెయ్యాలి అను కున్నాను. దాని మనసులో బాధ తలుచుకుంటే అదేదో అఘాయిత్యం తలపెడుతుందనిపించింది.

శుభ్రంగా స్నానం చేసి సాయంత్రం షికారుకి బయల్దేరాను — రోజూలాగే. ఇవాళ మాత్రం మనసెంతో తేలిగ్గా ఉంది. ఒక మంచి పని చేస్తున్నాను — ఒక మనిషి మానసిక వేదన తగ్గిస్తున్నాను అనే గర్వంవల్ల కాబోలు.

నెమ్మదిగా మా వీధిలో నడుస్తూ ఆలో చిస్తున్నాను. ఎప్పటికైనా మనుషులు తోటి మనిషికూడా తనలాంటి వాడేనని గుర్తిస్తారా! ఎదుటి మనిషిని అంత చిత్రహింసకు గురిచేస్తే ఒరిగేదేమిటి ?

నా ఆలోచనల్లో పడి ఎంతదూరం నడిచానో గుర్తులేదు. చీకటి పూర్తిగా పడలేదు. కాని వెలుగు మాత్రం లేదు. అంతలో ఏవో మాటలు వినబడి గబుక్కున ఆగిపోయాను. ఆ కంఠం ఎవరిదో! ఎప్పుడూ విన్న గొంతులా కూడా లేదే! ఎవరిదో ఏడుపు. ఎవరివో అరుపులు.

"ఛీ పాపిష్టిదానా! గుడిసిలో తగలడక నాకెందుక్కనిపిస్తవే! ఎదవ సచ్చిందానా; నువ్వెదురొచ్చినావు—ఏ ఇంట్లో ఒక్క పైసా కూడా తగన్లేదు. ఛీ! ఇయ్యాల అన్ని చోట్లా తిట్లేనే''. ఎవర్నో కొడుతున్న చప్పుడు.


నాకు విషయం అర్థం అవ్వడానికి ఒక నిమిషం పట్టింది.


ముసలమ్మ తన దగ్గరుంటున్న చిన్నపిల్లని దారుణంగా కొడుతోంది. తరువాత మాటలు నాకు వినబడ్డం మానేశాయి. ★


బాదల్ ఫ్యానులు

10 సం॥ సర్వీస్ గ్యారంటి

మీ ఇంటి చూరునుండి చిరుగాలుల చిందులకు




ప్రముఖ ఫ్యాన్ డీలర్లందరివద్ద లభించును.

Jaisons/AMA/19/84 TEL